
కథ

# త్రిశంకు స్వర్గం

జి.ఎస్. లక్ష్మి

**''వటపత్రశాయికి వరహాల లాలీ... రాజీవ నేత్రునికి రతనాల లాలీ**
**లాలీ లాలీ లాలీ లాలి.... లాలీ లాలీ లాలీ లాలి''**
**సిడీ ప్లేయర్‌లోంచి హాయిగా జోలపాట వినిపిస్తోంది. నిద్రలోకి జారిన కొడుకు అనిరుద్ధ్‌ని వాడి మంచం మీద పడుకోబెట్టి, జాగ్రత్తగా కంఫర్టర్ కప్పి, సిడీ ప్లేయర్‌ని ఆఫ్‌చేసి ఫామిలీరూమ్‌లో కొచ్చింది వసంత.**



జనవరి నెల. మొదటి వారం.

షికాగో దగ్గర్లోని సబర్బ్‌లో వసంత ఇంటి ముందు లాన్ అంతా మంచుతో కప్పడిపోయింది. వీధి గుమ్మానికి పక్కగా వేసిన గులాబి, చామంతి మొక్కలపై మంచు పేరుకుపోయింది. అద్దాల్లోంచి పైనుంచి సన్నగా కురుస్తున్న మంచు కనిపించింది. ఒక్కసారి అమ్మ మాటలు గుర్తొచ్చాయి. క్రితం సంవత్సరం అనిరుద్ధ్ పుట్టినప్పుడు అమ్మ వచ్చింది. అప్పుడు ఇలాగే పడుతున్న మంచునిచూసి అమ్మ ''సన్నజాజి రేకులు జలజలా రాల్తున్నట్టు యెంత బాగుందే ఈ మంచు వర్షం...'' అంది. ఆ రోజు అమ్మలోని భావుకతకు ఎంత సంతోషించిందో, కాని ఈ రోజు, ఇలా గంటగంటకీ పేరుకుపోతున్న మంచును చూస్తుంటే యేంటో మనసంతా స్తబ్ధంగా అయిపోతోంది.

ధనరాజ్ పొద్దున్నే లేచి, డ్రైవ్ వేలో వున్న మంచునంతట్నీ తవ్విపోసుకుని మరీ ఆఫీసుకెళ్ళాడు. మళ్ళీ వచ్చేటప్పటికెలా వుంటుందో... ఆలోచిస్తూ కిచెన్‌వైపు నడిచింది వసంత. అలవాటుగా అన్నం తిందామనుకుంది. కాని ఈ చలికో యేమో పొద్దున్న తిన్న బ్రెడ్ స్లైస్‌లే ఇంకా కడుపులో పెట్టిలో పెట్టినట్టున్నాయి. అన్నం తినకపోతేనేం, యిప్పుడు నష్టమేంటి... అనుకుంది. అంతగా అయితే ధనరాజ్ రాగానే తొందరగా డిన్నర్ తినేస్తే సరి అని కూడా అనుకుంది. అన్నం తినకపోతే నష్టం లేకపోగా మరింత లాభం కూడా కనిపించింది వసంతకి. అదేమిటంటే అన్నం తిన్న కంచం కడుక్కోనక్కర్లేదు. హమ్మయ్య అనిపించి ఫ్రిజ్‌లో వున్న డయట్ కోక్ కేన్ తీసుకుని బ్రేక్ ఫాస్ట్ టేబిల్ ముందు కూర్చుంది.

ఇంతలో ఫోన్‌మోగింది.

యెవరా అనిచూస్తే జయ. జయ వసంతతో కలిసి ఇండియాలో ఇంటర్ చదివింది. హైదరాబాదులోనే ఇంజనీరింగు చేసి వసంత లాగే ఒక హెచ్.వన్ వీసాలో వున్న అబ్బాయిని పెళ్ళాడి అమెరికా వచ్చింది. వసంతకి రెండుగంటల డ్రైవ్‌లో వుంటోంది. యెప్పుడో యేడాది కొకసారైనా కల్సుకుంటారో లేదో కాని ఇద్దరూ ఫోన్లో మటుకు తరుచు మాట్లాడుకుంటూనే వుంటారు. ఆమె కూతురు ప్రశాంతి కూడా ఇంచుమించు అనిరుద్ధ్ ఈడుదే. అందుకే ఇద్దరూ పిల్లల్ని పెంచడంలో వున్న సాధక బాధకాలు మాట్లాడుకుంటుంటారు.

ఫోన్ యెత్తడం ఆలస్యం చేస్తే ఆ శబ్దానికి అనిరుద్ధ్ లేస్తాడేమోనని వెంటనే తీసి మాట్లాడింది వసంత.

''హాయ్ జయా, యేవిటి కబుర్లు. ప్రశాంతి పడు కుందా..''

''ఇంకా యెక్కడే బాబూ. దానికో గంట ప్రయత్నం కదా... ఈ లోపల నీకో లేటెస్ట్ న్యూస్ చెబ్దామనీ...''

''యేంటే అదీ..''

''అదే, మనతో ఇంటర్ చదివిందే ఉష, గుర్తుందా...''

''అవునూ, యిక్కడెక్కడో యెమ్మెస్ చేస్తోందికదా... జాబ్‌కోసం చూస్తోందన్నావ్.... యేమైంది?''

''యేమీ కాలేదు. పెళ్ళి కుదిరింది''.

''అవునా. అయితే గుడ్‌న్యూస్ అన్నమాట''.

''యేంటి గుడ్ న్యూసూ... ఇన్నాళ్ళూ మనలాంటి వాళ్ళమే చేతులు ముడుచుకుని కూర్చున్నామను కున్నాం. ఇప్పుడు మనతోపాటు అదీ చేరింది''.


''అలాగెందుకవుతుందే. అది మనలాగ డిపెండెంట్‌గా హస్బెండ్ వెనకాల రాలేదు కదా. స్టూడెంటు వీసాతో వచ్చింది. దానికి జాబ్ దొరికే ఛాన్సెస్ వున్నాయి కదా...''

''నేనూ అలాగే అనుకున్నాను. కాని దాని కాబోయే మొగుడు ఈస్ట్ కోస్ట్‌లో వుంటాడుట. ఇది డిగ్రీ తీసుకుని అక్కడికెళ్లి జాబ్ వెతుక్కో వాలిట. ఈ పరిస్థితుల్లో ఆ మొగుడు పనిచేసే చోటే కావాలంటే అంత తొందరగా దొరుకుతుందంటావా?''

''ఎక్కడ దొరికితే అక్కడ జేరితే సరి. ముందు జాబ్ దొరకడం ముఖ్యం కదా..''

''నేనూ అదే అన్నాను. దానికది ఇద్దరం చెరోచోటా వుండేమాటయితే ఇంక పెళ్ళి చేసుకోవడమెందుకని అడిగింది''.

''మరేం చేస్తుందిట..''



''యెమ్మెస్ డిగ్రీ తీసేసుకుని, అతని దగ్గరకే వెళ్ళిపోతుందిట. అక్కడ జాబ్ దొరికితేనే చేస్తుందిట. లేకపోతే యేముంది. మనలాగే పిల్లల్ని కంటుందిట. రెండు పడవల మీదా రెండు కాళ్ళూ పెట్టి ప్రయాణం చెయ్యలేం కదా అన్న సూక్తి కూడా చెప్పింది''.

ఒక్కసారి ''అయ్యో'' అనిపించింది.

జయ చెప్తోంది. ''ఇక్కడ డిగ్రీ చేతిలో వుండి కూడా భర్త పనిచేసే చోటే జాబ్ దొరకాలంటే కొంచెం కష్టమే. పోనీ యెక్కడ దొరికితే అక్కడకెళ్ళి చేద్దామంటే ఇద్దరూ చెరోచోటా వుండక తప్పదు. మరింక పెళ్ళి చేసుకోడ మెందుకు?'' వసంతకంతా గందరగోళంగా అనిపించింది. ప్రశాంతి యేడుపు గట్టిగా వినిపించింది ఫోనులో. ''దీనికి ఫీడింగ్ టైమ్ అయిందే. మరింక పట్టుకోలేం. తర్వాత మాట్లాడుతా''. జయ ఫోన్ పెట్టేసింది. జయ చెప్పినమాటలు బుర్రలో తిరుగుతుంటే వసంత ఆలోచనలో పడింది. అసలీ చదువులు యెందుకు చదువుతున్నట్టో యేమో అర్థం కాలేదామెకి.

అనిరుద్ధ్ మరో రెండు గంటలవరకూ లేవడు. అప్పటిదాకా యేం చెయ్యడం....

ప్రతిరోజూ ఈ ప్రశ్న ఒక భూతంలా వసంత ముందుకొస్తోంది. మనసుని ఎలాగోలా సమాధానపరుచుకుంటూ నెట్టుకొస్తోంది. కాని జయతో మాట్లాడాక ఇవాళెంటో మనసంతా అమ్మా నాన్నల వైపు లాగుతోంది. పోనీ తీరుబడిగా అమ్మా,నాన్నలకి లెటర్‌రాస్తే అనుకుంది. బలే ఐడియా. అమ్మ అస్తమానం అంటూంటుంది. ''ఎన్ని ఈ మెయిల్స్ ఇచ్చినా, ఎన్ని సార్లు ఫోన్లో మాట్లాడినా నువ్వు మామూలుగా రాసే వుత్తరం చదువు తుంటేనే నాకు బాగుంటుంది అమ్మలూ'' అని. ఆ మాట గుర్తురాగానే పేపరూ, పెన్నూ తీసుకుని లెటర్ రాయడం మొదలు పెట్టింది వసంత.

''నా ప్రియాతి ప్రియమైన అమ్మకీ, నాన్నకీ,

మీరిద్దరూ యెలా వున్నారమ్మా? యిక్కడ మేము బాగానేవున్నాం. ధనరాజ్ ఆఫీసుకెళ్లాడు. అనిరుద్ధ్ నిద్రపోతున్నాడు'' వుత్తరం రాయడం మొదలు పెట్టగానే వసంతకి అమ్మా, నాన్న యెదురుగా వున్నట్టే అనిపించింది. పూర్తిగా అందులో లీనమైపోయింది. ''బైట కురుస్తున్న మంచుని చూస్తుంటే అమ్మా, నాకు నీ మాటలే గుర్తొస్తున్నాయమ్మా. ఎంతబాగాచెప్పావ్, సన్నజాజిరేకులు జలజలారాల్తున్నాయా... నీలో భావుకతకి నీరాజనం పట్టాలి. మరి నాకు అలా అనిపించటం లేదేంటమ్మా...

ఒక విధంగా ఆలోచిస్తే నువ్వన్నది నిజమే. నాకు యిదివరకు అలాగే అనిపించేది.

మల్లెరేకులు నేల మీదపడి మంచు బిందువులైనట్లు, కైలాస శిఖరం మీద శివపార్వతులు నాట్యం చేస్తుంటే అదిరిన హిమగిరి నుంచి జారిన మంచు బిందువులున్నట్టు యింకాయింకా యేవో యేవో అనిపించేవి. కాని ఇప్పుడెందుకమ్మా నా మనసు పలకటం లేదు.. ఒక విధమైన స్తబ్ధత యేర్పడినట్టనిపిస్తోందెందుకమ్మా... ఈ పడుతున్న మంచు పేరుకుంటుంది. మళ్ళీ ధనరాజ్ ఆ మంచుని తవ్వితీస్తే తప్పకారు గరాజ్ దాకా తేలేడేమోనన్న ఆలోచన యెందుకొస్తోందమ్మా... ఈ పూట ఆకలిగా లేదని అన్నం కూడా తినలేదు. అక్కడయితే నువ్వు వూరుకునే దానివా అమ్మా... అన్నం కలిపి నోట్లో పెట్టేదానివి. నాకు నువ్వూ, డాడీ గుర్తొస్తున్నారమ్మా. అంతప్రేమగా పెంచారే.. ఒక్కమాట అడగాలనుందమ్మా... అసలు నాకు పెళ్ళెందుకు చేసేరమ్మా? అలా పెళ్ళిచేసే వుద్దేశ్యం ముందే వున్నప్పుడు అసలు నాకు చదువెందుకు చెప్పించారమ్మా... మల్లెచెట్టుని పెంచి ముళ్ళ తోటలోకి పంపించారు కదమ్మా...

ఊహ తెలిసినప్పట్నుంచీ మంచిస్కూల్లో చేర్పించి, వెనకాలేవుండి, యూనిట్ టెస్టులని కూడా పబ్లిక్ పరీక్షలన్నంత శ్రద్ధగా నాచేత రాయించి, మెట్టుమెట్టుకీ నన్ను ప్రోత్సహించి, అందరు గొప్పగా చెప్పుకునే బిట్స్ పిలానీకి పంపించి చదివించారమ్మా నన్ను మీరు. డాడీ, నీకు గుర్తుందా... నాకు బాగా గుర్తుంది. ఇంటర్ చదువుతున్నప్పుడు ట్యూషన్ కెళ్ళాలంటే తెల్లారకట్ట ఐదింటికి లేచి, రెండు మైళ్ళు వెళ్ళాల్సొచ్చేది. దానికోసం నన్ను లేపి, నన్నొక్కదాన్నీ అంతచీకటిలో పంపడం ఇష్టం లేక రోజూ నువ్వూ నాతో వచ్చేవాడివి. ట్యూషన్ పూర్తయ్యేదాకా యెదురుకుండా వున్న పార్కులో బెంచీమీద కూర్చుని మళ్ళీ ఇంటికి తీసుకొచ్చేవాడివి. నాకు మంచి మార్కులొస్తే నీ సంతోషానికి పట్టపగ్గాలుండేవి కావు. నీ మొహంలో సంతోషం చూసి నాకు ఇంకా ఇంకా చదవాలనిపించేది. అలాగే చదివాను నాన్నా... నీకోసం బాగా చదివాను. నీ ముద్దు తీర్చానని యెంత సంబరపడిపోయావో కదా. మరింక అమ్మయితే చెప్పనే అక్కర్లేదు''.

''నాతల్లి బాగా చదువుకుని తన కాళ్ళమీద తను నిలబడాలి'' అంటూ ఒక్క నిమిషం కూడా వృధా చెయ్యకుండా చదువుకునేట్టు నాకు అన్నం కూడా కలిపి తినిపించేది. నేనూ అలాగే చదువుతప్ప మరో లోకమే లేదన్నట్టు చదివాను. ఫస్టుమార్కులు వస్తున్న కొద్దీ యింకా యింకా వుత్సాహం తెచ్చుకుని మరీ చదివాను. ఎంత చక్కటిరోజులు డాడీ అవి... అమ్మ అన్నం కలిపి పెడుతుంటే తినడం, నాన్న కావలసినవన్నీ అందిస్తుంటే ఒక రాజకుమార్తె వనంలో విహరించినట్లు ఆ పుస్తకాల మధ్యలో విహరించేదాన్ని. డాడీ, నీకు గుర్తుందా... సమ్మర్‌లో సరిగ్గా ఎగ్జామ్ టైమ్‌లో కరెంటు పోయేది. పైన డాబామీద చల్లగా వుంటుందని ఎమర్జన్సీ లైటు పెట్టుకుని చదువుకుంటుంటే నువ్వు వెనకాల నిలబడి నాకు దోమలు కుట్టకుండా విసనకర్రతో విసిరేవాడివి. ఎందుకు డాడీ నేనంటే నీకంత ప్రేమ. నేను బాగా చదవాలని నాకన్న మీరిద్దరూ యెక్కువ టెన్షన్ పడ్డారు కదా. ఒక్కమాట అడగాలనిపిస్తోంది డాడీ, అడగనా.... డిగ్రీలు దేనికి డాడీ. ఉద్యోగం చెయ్యడానికే కదా... మరి మీరు నాకా అవకాశం యివ్వకుండా పెళ్ళిచేసారేంటి.. నేను మిమ్మల్ని తప్పు పట్టడం లేదు డాడీ, మీరు సరిగ్గానే ఆలోచించారు. వయసు మించి పోకుండా పెళ్ళి చేస్తే పెళ్ళయ్యేక వుద్యోగం చేసుకుంటాననుకున్నారు. అమ్మయితే మరీను. చక్కటి సంబంధం. వాళ్లంతా మంచివాళ్ళు. అమెరికాలో అయితే అమ్మాయి చదువుకీ, వుద్యోగానికీ బాగా అవకాశాలుంటాయని యెంతోదూరం ఆలోచించి ఈ పెళ్ళి చేసారు. మీరనుకున్న దంతా నిజమే. వాళ్లంతా చాలా మంచివాళ్ళు. నన్ను వాళ్ళింట్లోకి చక్కగా చేర్చుకు

న్నారు. ధనరాజ్ అయితే మరీమంచివాడు. మొన్న అనిరుద్ధ్ పుట్టినప్పుడు మీరూ చూసారుగా. మీరు ఆలోచించినదంతా సరిగ్గానే వుంది. ఒ , అమెరికా తప్ప.

అవును నాన్నా, యిది లా ఫ్రీ కంట్రీ. అవకాశాలు కోకొల్లలు. కానీ ఎ వరికి డాడీ అవన్నీ... నాలాంటి వాళ్ళకికాదు. నాలాంటి వాళ్ళు వుద్యోగం చేసి సంపాదించుకుందుకు లేదు. యిక్కడి చట్టం అందుకు ఒప్పుకోదు. మేము ఒక భర్త ఆదాయం మీద ఆధారపడి ఈ దేశం వచ్చాము కదా. ఆ వీసా స్టేటస్ మారితే కాని మేము లీగల్‌గా వుద్యోగం చెయ్యడానికి లేదు. అది క్లియర్ అయేసరికి యేళ్ళు గడిచిపోతాయి. పోనీ పైకి చదువుకుందామంటే ధనరాజ్ వుద్యోగం చేస్తున్న దగ్గరలో వున్న కాలేజీలోనే అడ్మిషన్ రావాలి. ఒకవేళ వచ్చినా ఫీజులు అకాశాన్నంటుతుంటాయి. పోనీ ఫెలోషిప్ తెచ్చుకోవచ్చు కదా.

అంటావేమో... తెచ్చుకోవచ్చు నాన్న, తెచ్చుకోగలను కూడా... కానీ మళ్ళీ దానికి నా వీసా స్టేటస్ స్టూడెంట్ వీసాకి మార్చుకోవాలి. ఒకవేళ మార్చుకుని కష్టపడి డిగ్రీ చేసినా ఇప్పుడిక్కడ జాబ్ వస్తుందన్న గారంటీ లేకుండా పోయింది. వుద్యోగాల్లో వున్న వాళ్లే యేరోజు పింక్‌స్లిప్ వస్తుందోనని భయంతో వున్నారు.

చదువుకుందుకు లేక, వుద్యో ం చెయ్యడానికి వీల్లేక నాలా బాధపడుతన్న వాళ్ళు లామంది వున్నారు నాన్న యిక్కడ. ఈ లోపల పిల్లల పుట్టకొస్తారు. నేచురల్ రెస్పాన్సిబిలిటీ, సంతోషంగా స్వీకరిస్తాం. వూరికినే వుండలేక ఏ పార్ట్ టైమ్ చేద్దామ ్నా, ఈ పిల్లల్ని పెట్టే చోట అంతకన్న యెక్కు విచ్చుకోవాలి. చిన్నప్పట్నించీ చదివిన పుస్తకాల జ్ఞానం వేరు. పెళ్ళయ్యాక ఈ ఇల్లాలి జీవితం వేరు. డాడీ, నీకు గుర్తుందా...క్లాసులో నేను ఫస్టు వస్తానని అందరూ నన్ను మెచ్చుకుంటుంటే ఆ గర్వమంతా నాకు నీ కళ్ళలో కనిపించేది. అప్పుడు అక్కడ చదువుకునే పిల్లలందరికీ నన్నొక ఆదర్శంగా చూపించే వారు. కాని అమ్మా, ఇప్పుడిక్కడ నన్నెవరూ మెచ్చుకోవట్లేదమ్మా. యిక్కడ కూడా తెలుగువాళ్ళందరూ కలుస్తూం టారు. కాని వాళ్ళ ప్రపంచం వేరమ్మా. చక్కెర పొంగలి లాంటివన్నీ ఎలా చెయ్యాలి, లలితా సహస్రం, విష్ణు సహస్రం ఎప్పుడు చదువుకుందాం, వరలక్ష్మి వ్రతం ఎప్పుడు చేసుకుందాం... ఇలాంటివన్నీ మాట్లాడుకుంటారమ్మా వాళ్ళు. అవి తప్పని నేను అనటం లేదు. కాని ఇలాంటివన్నీ నాకు తెలీదుకదా. అందుకని ఫస్టు మార్కులన్నీ వాళ్లకే. నన్నెవరూ గుర్తించడం లేదమ్మా. అమ్మా, నాకు పూలమాలలు కట్టడం యెందుకు నేర్పలేదమ్మా. ఇక్కడందరూ మాలలు యెంత బాగా అల్లేస్తున్నారో. ముగ్గులు యెంత బాగా వేస్తున్నారో. మాకు యెప్పుడు సరిగ్గా సంక్రాంతి ముందే హాఫియర్లీ ఎగ్జామ్స్ వచ్చేవి. చదువు పాడవుతుందని డాడీ నన్ను ముగ్గులు వెయ్యనిచ్చేవారు కాదు. కాని యిప్పుడు నాకా చదువు యెందుకూ పనికి రావట్లేదమ్మా. నన్ను ముందుముందు పెళ్ళిచేసి పంపాలనే వుద్దేశ్యం మీకున్నప్పుడు నాకు చిన్నప్పటించీ అందుకు అవసరమయేవి యెందుకు నేర్పలేదమ్మా.

మూడేళ్ళప్పుడూ నన్ను స్కూల్లో చేర్పించావు. అప్పట్నించీ పద్దెనిమిదేళ్ల పాటు అవిశ్రాంతంగా చదివాను. చక్కటి డిగ్రీ చేతిలో వుంది. యెందుకమ్మా అది. వుద్యోగం చేసే వీసా స్టేటస్ నాకిప్పుడు లేదు. ఈ రోజులు చూస్తుంటే ధనరాజ్ వుద్యోగానికే యేమవుతుందా అన్నట్టుంది. మరింక మా వీసా స్టేటస్ మారే టైమ్‌కి పరిస్థితి యెలా వుంటుందో అనిపిస్తోందమ్మా. నేను ఈక్వేషన్సన్నీ మర్చిపోయేనమ్మా. మరింక నాకు వుద్యోగమెలా వస్తుందమ్మా. అందల మెక్కించాలనుకున్నావమ్మా. కాని, యెక్కలేనంత యెత్తుగా వుందది. పోనీ దిగుదామంటే నేల మరీ క్రిందగా వుందమ్మా, పడిపోతానేమో. అమ్మా, నీకు గుర్తుందా. డాడీకి లెఖ్ఖ చెప్పాలంటూ నువ్వు స్వతంత్రంగా పది రూపాయలు ఖర్చు చెయ్యడానికి భయపడే దానివి. కాని యిప్పుడు నేనూ అలాగే వున్నామ్మా. క్రెడిట్ కార్డు వాడినప్పుడల్లా ధనరాజ్‌కి అకౌంట్ చెప్పాలన్న ఆలోచన వస్తోంది. మరింక మేము మీ కన్న యెందులో యెక్కువో అర్థం కావటం లేదు.

చిన్నప్పుడు నువ్వొక కథ చెప్పేదానివి కదమ్మా. అదే. విశ్వామిత్రమహర్షి తన తపశ్శక్తితో త్రిశంకుడిని శరీరంతో సహా స్వర్గానికి పంపుదామను కున్నాడుట. కాని అతనికి స్వర్గంలోకి అనుమతి లభించలేదుట. మళ్ళీ ఆ త్రిశంకుడు భూమి మీదకి రాకుండా విశ్వామిత్రుడు తన తపశ్శక్తినంతా ధారపోసి మధ్యలోనే అతనికి ఒక స్వర్గం నిర్మించాడనీ, దానినే త్రిశంకు స్వర్గం అంటారనీ చెప్పావు. ప్రస్తుతం ఆ పరిస్థితిలోనే వున్నానమ్మా నేను. యేదో చేసేద్దామని పద్దెనిమిదేళ్ళు శ్రమపడ్డాను. అది అందలేదు. మామూలుది నచ్చదు. దిగలేను. యెటూ కాకుండా త్రిశంకు స్వర్గంలో వేళ్ళాడుతున్నాను.

ఇక్కడ నేనేకాదమ్మా. ఇంటర్నెట్‌లో చదివాను. ఇన్నాళ్ళకి చక్కగా ఆడ పిల్లలు చదువుకుందామనుకుంటుంటే వాళ్ళమీద యాసిడ్ దాడి జరుగు తోందిట కదమ్మా ఇండియాలో. అన్ని అర్హతలు వుండి సమాజంలో భద్రత లేక యెంతమంది ఆడవాళ్ళు మానసికంగా నలిగిపోతున్నారో చూస్తున్నావా, అమ్మా. చదువుకుందామంటే ప్రేమించమంటూ యాసిడ్ దాడులు. వుద్యోగం చేసుకుందామంటే మానప్రాణాల భయం. చదువుకుని మేం సాధించిందేంటమ్మా. ఈ సమాజం యిలా తయారయిందేంటమ్మా. అసలు మనం పురోగమిస్తున్నామో తిరోగమిస్తున్నామో తెలియటం లేదు. ఈ భావాన్ని మాటల్లో యెలా చెప్పాలో తెలీటం లేదు.

అమ్మా, నీకు కవిత్వమంటే యిష్టం కదా. శ్రీశ్రీ కవిత్వాన్ని నువ్వు నీ మాటల్లోకి మార్చేసుకునేదానివి గుర్తుందా...

యే దేశ చరిత్ర చూసినా యేమున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం
అని ఆయన రాస్తే నువ్వు దానిని.
యే నారి చరిత్ర చూసినా యేమున్నది గర్వకారణం
స్త్రీ జాతి చరిత్ర సమస్తం వరపురుష పాదాక్రాంతం.
అని మార్చావు.

కాని తరం మారింది కదా. నేను దానిని మరోలా మార్చాను.

యే లేమ చరిత్ర చూసినా యేమున్నది గర్వకారణం
స్త్రీ జాతి చరిత్ర సమస్తం నవసమాజ పీడన -- సత్యం''

.....................

అరె. యిదేంటి... అక్షరాలిలా నీళ్ళలో తేల్తున్నాయి... గబుక్కున ఈ లోకంలో కొచ్చింది వసంత. యెప్పుడు నిండాయో కళ్ళనిండుగా నీళ్ళు. అక్షరాల మీద పడి అలుక్కుపోతున్నాయి. ఒక్క వుదుటన లేచి టాప్ దగ్గరకెళ్లి చన్నీళ్ళతో మొహం మీద కొట్టుకుంది. కాస్త చల్లగా అనిపించింది. గుండె లోతుల్లోంచి వచ్చిన వుద్వేగం చల్లబడింది. నెమ్మదిగా రాసిన కాగితాలను మడిచి డ్రాయరులో వెనక్కి పడేసింది.

అమ్మా నాన్నకీ యిలా రాసేనేంటి.... వాళ్ళ దృష్టిలో తను చాలా అదృష్టవంతురాలు. అనుకూలుడైన భర్తా, యెంచక్కటి కొడుకూ చక్కటి సంసారం. నిజమే కదా అందరూ చూసేది అదే. తను పడే మానసిక వ్యధ వాళ్ళకి తెలీకూడదు. వాళ్ళప్రాణాలన్నీ తన మీదపెట్టుకు పెంచారు. తను సంతోషంగా వున్నానని చెప్తేనే వాళ్లకి తృప్తి. ఇంత దూరంలో వుండి తను వాళ్లకి చేయగలిగింది ఆ తృప్తి నివ్వడమే.

సోఫాలో కూలబడి యెదురుగా టీపాయ్ మీదున్న ల్యాప్‌టాప్‌ని వొళ్లోకి తీసుకుంది. జీ మెయిల్‌కి వెళ్ళి తెలుగు మాటల్ని ఇంగ్లీషు అక్షరాల్తో టైప్ చెయ్యడం మొదలు పెట్టింది.

''హాయ్ మామ్ అండ్ డాడ్, వియార్ ఫైన్. అనిరుద్ధ్ చాలా అల్లరి నేర్చుకుంటున్నాడు. ధనరాజ్ బాగానే వున్నాడు. ఈ వీకెండ్‌కి ఒకసారి టెంపుల్‌కి వెడదామనుకుంటున్నాం.

అమ్మా, అనిరుద్ధ్ బర్త్‌డేకి అక్కడ అర్చన చేయిస్తావు కదా... అక్కడి అందరి విశేషాలూ రాయండి. విత్ లవ్.... మీ స్వీటీ...''

''సెండ్'' బటన్ నొక్కి మెయిల్ పంపించింది వసంత. మనసుని యెన్నో విధాలుగా సమాధానపరుచుకోవడమే కాబోలు జీవితమంటే అనుకుంటూ అలసటగా తల వెనక్కి వాల్చింది.

*

రచయిత్రి సెల్ నెం: 9908648068

కవిత

## చైతన్య శూన్యులు

చుట్టాల రాకని తెలిపే
కాకుల్లేవు
కిచ్..కిచ్ మని సందడి చేసే
పిచుకల్లేవు
ఆమని ఆగమనాన్ని ఎరుకపరచే
కోకిల జాడే వుండదు
సర్కస్‌లోని జంతువుల
విన్యాసాలకి
పంజరాల్లోని పక్షుల
వెతలకి
గుండెలు బాదుకునే
జీవకారుణ్యమున్న వాళ్ళు
కాంక్రీటు జంగిల్
అప్రతిహతంగా విస్తరిస్తూ
జంతుజీవజాలాన్ని
అంతరింపజేస్తుంటే
కళ్ళప్పగించి చూస్తూ
బధిరుల్లా వ్యవహరిస్తున్నారు
చైతన్య శూన్యులవుతున్నారు
ఎందుకోమరి?



– ప్రతాప వెంకటసుబ్బారాయుడు
040-7111088